సాక్షి ఖమ్మం

శుక్రవారం ၊ 28 ၊ మార్చి ၊ 2025

I



భవనాలు భద్రమేనా..?

నిబంధనలు పాటించని బహుళ అంతస్తుల నిర్మాణాలు. శిథిలావస్థకు చేరిన భవనాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. IIలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం సా॥) 6.28

సహర్ (శనివారం ఉ॥) 4.49

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 40° / 21°

జిల్లాలో శుక్రవారం అధిక ఉష్ణోగత్ర నమోదవుతుంది. ఉదయం ప్రారంభమైన ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్‌: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లాలో శుక్ర, శనివారాల్లో పర్యటించనున్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు నగరంలోని సీక్వెల్‌ వద్ద నిర్వహించే ఇఫ్తార్‌ విందులో పాల్గొంటారు. రాత్రి 7 గంటలకు వైరారోడ్‌, 42వ డివిజన్‌లో ఓ ప్రైవేట్‌ కార్యక్రమంలో పాల్గొంటారు. శనివారం ఉదయం 9 గంటలకు 18వ డివిజన్‌ శ్రీరామ్‌హిల్స్‌లో బీటీ రోడ్డు నిర్మాణానికి, సాయంత్రం 4.30 గంటలకు రఘునాథపాలెం మండలం వీవీ పాలెం నుంచి ఇల్లెందు రోడ్డులో ఎన్నెస్పీ కెనాల్‌ వద్ద బీటీ రోడ్డు నిర్మాణానికి, అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 6 గంటలకు తల్లాడ మండలం బిల్లుపాడులో ఓ ప్రైవేట్‌ కార్యక్రమంలో పాల్గొంటారు.

పడిపోతున్న నీటి మట్టం

11.8 అడుగులకు చేరిన వైరా రిజర్వాయర్‌



అడుగంటుతున్న వైరా రిజర్వాయర్‌

వైరా: వైరా రిజర్వాయర్‌ నుంచి తాగు, సాగు అవసరాలకు నీరు విడుదల చేస్తుండడంతో నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. రిజర్వాయర్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 18.3 అడుగులు కాగా ప్రస్తుతం 11.8 అడుగులకు చేరుకుంది. ఎండల తీవ్రత నేపథ్యంలో రోజుకు 33 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతుండగా.. రిజర్వాయర్‌ కుడి, ఎడమ కాల్వల ద్వారా 12 క్యూసెక్కుల నీటిని పంటలకు విడుదల చేస్తున్నారు. మరో 37 క్యూసెక్కుల నీటిని మిషన్‌ భగీరథ పథకానికి వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు రిర్వాయర్‌లో నీటి లభ్యతపై ప్రభుత్వానికి నివేదిక అందించారు. సాగర్‌ ప్రధాన కాల్వ నుంచి వైరా రిజర్వాయర్‌కు నీటిని మళ్లిస్తే వేసవి నుంచి గట్టెక్కే అవకాశం ఉంది. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలోచించి రిజర్వాయర్‌కు సాగర్‌ జలాలు మళ్లించాలని పలువురు కోరుతున్నారు.

ఖమ్మం మార్కెట్‌కు వరుస సెలవులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజులు సెలవులు ప్రకటించారు. ఈనెల 29న అమావాస్య, 30న ఆదివారంతో పాటు ఉగాది, 31న రంజాన్‌, ఏప్రిల్‌ 1న రంజాన్‌ పండుగ తెల్లవారి కూడా సెలవు ఇస్తున్నట్లు మార్కెట్‌ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్‌ 2వ తేదీ బుధవారం నుంచి పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

ముగిసిన ‘బార్‌’ ఎన్నికలు



వెంకటేశ్వరరావు



దిలీప్‌

ఖమ్మంలీగల్‌ : ఖమ్మం బార్‌ అసోసియేషన్‌ ఎన్నికలు గురువారం ముగిశాయి. కొంత కాలంగా హోరాహోరీ ప్రచారం సాగించిన ఈ ఎన్నికల్లో మొత్తం 816 ఓట్లకు గాను 719 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 10 గంటలకు పోలింగ్‌ ప్రారంభం కాగా, న్యాయవాదులు ఉత్సాహంగా వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. ‘బార్‌’ అధ్యక్షుడిగా తొండపు వెంకటేశ్వరరావు తన సమీప అభ్యర్థి వెంకటేశ్వర గుప్తాపై 168 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఉపాధ్యక్ష పదవికి విజయశాంత సమీప ప్రత్యర్థి ఎస్‌కే జానీపై 5 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా గద్దల దిలీప్‌ తెల్లాకుల రమేష్‌ బాబుపై 39 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. గ్రంథాలయ కార్యదర్శిగా సింగారపు రాంబాబు, క్రీడా కార్యదర్శిగా కేవీపీ లక్ష్మి విజయం సాధించారు. జాయింట్‌ సెక్రటరీ, కోశాధికారి, మహిళా ప్రతినిధి పదవులు గతంలోనే ఏకగ్రీవమయ్యాయి. కాగా, గెలుపొందిన అభ్యర్థులకు ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రాలు అందించారు.

ముగిసిన శిక్షణ

ఖమ్మం సహకారనగర్‌ : నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో డాక్టర్‌ రెడ్డీస్‌ సంస్థ(సీఎస్‌డీ) సెంటర్‌ ఫర్‌ సస్టైనబుల్‌ డెవలప్‌మెంట్‌ సంస్థతో అనుసంధానంగా ఎలక్ట్రికల్‌ వెహికిల్‌ సర్వీస్‌ టెక్నీషియన్‌ అనే అంశంపై పది రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా సంస్థ బాధ్యులు భవ్య, దివ్వెల వెంకటేశ్వరరావు, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటంతో పాటు వారి భవిష్యత్‌ మార్చేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందించారు.

కొనుగోళ్లకు సన్నద్ధం

ప్రస్తుత యాసంగిలో రైతులు సాగు చేసిన వరి పంట కోతకు వస్తోంది. దీంతో వచ్చే నెల 1వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల సంస్థ నిర్ణయించింది. సాగర్‌ ఆయకట్టుతో పాటు బోర్లు, బావుల కింద సాగు చేసిన వరి ఇప్పటికే కోతకు వస్తున్న నేపథ్యాన నేలకొండపల్లి, కూసుమంచి, తల్లాడ, సత్తుపల్లి తదితర మండలాల్లో ఒకటి, రెండు రోజులు ముందుగానే కేంద్రాలు ఏర్పాటుచేసే అవకాశముంది. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం

జిల్లాలోని 344 కేంద్రాల ఏర్పాటుకు కార్యాచరణ

- ఈనెల 1నుంచి కేంద్రాల ప్రారంభం
- 25.84 లక్షల క్వింటాళ్ల సేకరణ అంచనా
- సన్నధాన్యానికి ఈసారి కూడా బోనస్‌



ధాన్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం (ఫైల్‌)

సన్న రకానికి ప్రాధాన్యత

వచ్చే నెల 1నుంచి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రేషన్‌ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేయనుంది. ఇందుకోసం వానాకాలం సీజన్‌లో సన్న ధాన్యాన్ని సేకరించి మిల్లులకు అప్పగించాక సీఎంఆర్‌గా తీసుకున్నారు. ఇక యాసంగి సీజన్‌లోనే సన్న ధాన్యం కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అందుకోసమే జిల్లాలో 344 కొనుగోలు కేంద్రాలు తెరవనుండగా, ఇందులో సన్న రకం ధాన్యానికి 282, దొడ్డు రకాల కోసం 62 కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నారు. కాగా, జిల్లాలో సన్న, దొడ్డు రకం కలిపి 25,84,928 క్వింటాళ్ల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో సన్న రకాలు 18,53,370 క్వింటాళ్లు, దొడ్డు రకం 7,31,558 క్వింటాళ్లు వస్తాయని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని 2,10,830 ఎకరాల్లో వరి సాగు కాగా, ఇందులో సన్న రకం 1,29,064 ఎకరాలు, దొడ్డు రకం ధాన్యం 81,766 ఎకరాల్లో సాగైంది.

క్వింటాకు రూ.500 బోనస్‌

గ్రేడ్‌–ఏ రకం క్వింటాకు రూ.2,320, సాధారణ రకాలకు రూ.2,300గా ధర నిర్ణయించారు. సన్న రకంలో 33రకాలను గుర్తించగా.. గత సీజన్‌ మాదిరే క్వింటాకు రూ.500 బోనస్‌ చెలిస్తారు. అయితే, మట్టి, రాళ్లు, పెళ్లలు, చెత్త, తాలు ఒక శాతం లోపే ఉండాలి. పూర్తిగా తయారు కాని, కుంచించుకుపోయిన ధాన్యం మూడు శాతం, పాడైన, రంగుమారి మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యం ఐదు శాతం, పక్వానికి రానిది ఒక శాతం, కల్తీ తక్కువ రకం ఆరు శాతం లోపు ఉంటేనే సేకరిస్తారు. తేమ 17 శాతంలోపు ఉంటేనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని అధికారులు అవగాహన కల్పించనున్నారు.

కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం



జిల్లాలో వచ్చేనెల 1నుంచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం. అయితే, నేలకొండపల్లి, కూసుమంచి, తల్లాడ, సత్తుపల్లి మండలాల్లో ఇప్పటికే కోతలు మొదలైనందున అక్కడ ముందుగానే కొనుగోలు కేంద్రాలు తెరవనున్నాం. అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు టార్పాలిన్లు, తేమ పరిశీలించే యంత్రాలు అందుబాటులో ఉంచాలని సూచించాం.

– శ్రీలత, మేనేజర్‌, జిల్లా పౌరసరఫరాల సంస్థ

వేర్వేరు ట్యాగ్‌లు

డీఆర్‌డీఏ, పీఏసీఎస్‌, డీసీఎంఎస్‌, మెప్మా ఆధ్వర్యాన 344 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తారు. సన్న, దొడ్డు ధాన్యం సేకరణకు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటుచేయనున్న అధికారులు ప్యాకింగ్‌లోనూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోనున్నారు. సన్న ధాన్యం బస్తాలను ఎరుపు రంగు దారంతో, దొడ్డు ధాన్యం బస్తాలను గ్రీన్‌ కలర్‌ దారంతో సీల్‌ చేయిస్తారు. తద్వారా సులువుగా గుర్తుపట్టొచ్చని చెబుతున్నారు.

కేంద్రాల్లో సౌకర్యాలు

ఎండల నేపథ్యాన కొనుగోలు కేంద్రాల్లో చలివేంద్రం ఏర్పాటు చేయడమేకాక ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు అందుబాటులో ఉంచనున్నారు. టెంట్లు, కుర్చీలు సమకూర్చి విద్యుత్‌ సౌకర్యం సమకూర్చుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే, గన్నీబ్యాగ్‌లు, ఇతర సామగ్రి వివరాలతో స్టాక్‌బోర్డు నిర్వహించాలని తెలిపారు. ధాన్యం అమ్మి రైతుల భూవివరాలు, ఆధార్‌ నంబర్‌, బ్యాంక్‌ అకౌంట్‌ వివరాలు, సెల్‌ఫోన్‌ నంబర్‌ను ఓపీఎంఎస్‌ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

క్వింటాకు కనీస మద్దతు ధర (రూ.)

(గ్రేడ్‌–ఏ) రకం	సాధారణ రకం
2,320	2,300

కొనుగోలు కేంద్రాలు	ధాన్యం సేకరణ (అంచనా) (క్వింటాళ్లు)	సన్న ధాన్యం (క్వింటాళ్లు)	దొడ్డు ధాన్యం (క్వింటాళ్లు)
344	25,84,928	18,53,370	7,31,558

నాణ్యమైన పదార్థాలే విక్రయించాలి

విజయ డెయిరీ పార్లర్‌ ప్రారంభోత్సవంలో కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌

ఖమ్మంవ్యవసాయం : వినియోగదారులకు నాణ్యమైన పాలు, పదార్థాలే విక్రయించాలని కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ అన్నారు. ప్రణాళికతో వ్యాపారాలను విస్తరించాలని సూచించారు. ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురంలో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పార్లర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మధిరలో ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటు చేశామని, విజయ డైరీతో సమన్వయం చేసుకుంటూ పాడి రైతుల నుంచి పాలు సేకరించి సరఫరా చేస్తున్నామని తెలిపారు. డెయిరీ పార్లర్‌ నిర్వాహకులకు అవసరమైన శిక్షణ ఇస్తామన్నారు. మిల్క్‌ షేక్‌, పాలు, పండ్ల రసాలు వంటివి కూడా విక్రయించి వ్యాపారాన్ని విస్తరించుకోవాలన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ డీడీ మోహన్‌ మురళీ, డిస్ట్రిబ్యూటర్లు నరేష్‌, జగదీష్‌, పార్లర్‌ నిర్వాహకులు మదార్‌ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సేవలు ప్రశంసనీయం

ఖమ్మంమయూరిసెంటర్‌: ప్రజల జీవన వ్యవస్థ సజావుగా సాగేలా కృషి చేస్తున్న ఆర్టీసీ కార్మికుల సేవలు ప్రశంసనీయమని కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ అన్నారు. ఖమ్మం బస్‌ డిపో సిబ్బందికి గురువారం ఆయన వాటర్‌ బాటిళ్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కార్మికుల కృషి ఫలితంగా మెరుగైన రవాణా సేవలు అందుతున్నాయని అన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు చాలా కష్టపడి పని చేస్తున్నారని, వేసవికాలంలో వారికి ఉపయోగపడేలా 650 వాటర్‌ బాటిళ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్మికుల సమస్యలను డిపో మేనేజర్‌ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఆర్థిక పరమైన ప్రణాళికలపై లీడ్‌ బ్యాంక్‌ మేనేజర్‌తో శిక్షణ ఇప్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్‌ మేనేజర్‌ మల్లయ్య, డిపో మేనేజర్‌ దినేష్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌

ఐకేపీ కొనుగోలు కేంద్రాలను పెంచాం..

ఖమ్మంసహకారనగర్‌: జిల్లాలో గతంలో 37 ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ఉండగా ప్రస్తుత యాసంగి సీజన్‌లో 137కు పెంచామని కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ తెలిపారు. సెర్ప్‌ సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలు, యాసంగిలో ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాలపై రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ కార్యదర్శి లోకేష్‌ కుమార్‌ గురువారం హైదరాబాద్‌ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. జిల్లా నుంచి పాల్గొన్న కలెక్టర్‌ మాట్లాడుతూ.. 2022–23 సంవత్సరానికి సంబంధించిన కమీషన్‌ పౌర సరఫరాల శాఖ వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. గన్నీ బ్యాగులు రీకన్సిలేషన్‌ ప్రక్రియ ఇంకా పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. దివ్యాంగుల నిర్ధారణకు ఆస్పత్రుల్లో అవసరమైన పరికరాల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో డీఆర్డీఓ సన్యాసయ్య, పౌర సరఫరాల జిల్లా మేనేజర్‌ జి. శ్రీలత, డీఈఓ సోమశేఖర శర్మ, గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌ విందు

ఖమ్మం సహకారనగర్‌ : నగరంలోని టీఎన్జీవోస్‌ కార్యాలయంలో తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఇఫ్తార్‌ విందు కార్యక్రమం నిర్వహించగా, కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్‌ మాసం ఆధ్యాత్మికతకు, స్వీయ క్రమశిక్షణకు ఉత్తమ సమయమని అన్నారు. దానధర్మాలతో పేదలను ఆదుకునేందుకే ఈ పండుగ జరుపుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో టీజీఏసీ జిల్లా చైర్మన్‌ గుంటుపల్లి శ్రీనివాసరావు, కో కన్వీనర్‌ కస్తాల సత్యనారాయణ, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు యలమద్ది వెంకటేశ్వర్లు, పారుపల్లి నాగేశ్వరరావు, కొణిదన శ్రీనివాస్‌, మోదుగు వేలాద్రి, చంద్రకంటి శశిధర్‌, చర్ల శ్రీనివాసరావు, వాసిరెడ్డి శ్రీనివాస్‌, వెంకటేశ్వర్లు, కృష్ణార్జున్‌రావు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌ విందులో కలెక్టర్‌ తదితరులు

‘బడ్జెట్‌’లో తీపి కబుర్లు

- కొత్తగూడెంలో యూనివర్సిటీ ఆఫ్‌ ఎర్త్‌ సైన్సెస్‌కు గ్రీన్‌ సిగ్నల్‌
- కొత్తగూడెం కార్పొరేషన్‌, కల్లూరు మున్సిపాలిటీల బిల్లు ఆమోదం
- భద్రాద్రికి నిధుల విడుదల, ఇల్లెందుకు దక్కిన సీతారామ హామీ
- బడ్జెట్‌ సమావేశాల్లో ఉమ్మడి జిల్లాకు తాయిలాలు



కొత్తగూడెంలోని ఇంజనీరింగ్‌ కళాశాల

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాల విభజనకు ముందు తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి పది జిల్లాల్లో మెదక్‌, ఆదిలాబాద్‌, ఖమ్మం జిల్లాలను మినహాయిస్తే ప్రతీ జిల్లాలో ఒక యూనివర్సిటీ స్థాపన జరిగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేయాలనే డిమాండ్‌ రాష్ట్ర విభజన ముందు నుంచి వినిపిస్తోంది. రాష్ట్ర విభజన సమయంలో గిరిజన యూనివర్సిటీని ఈ జిల్లాలో ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేసినా అది ములుగు జిల్లాకు తరలిపోయింది. దీంతో కొత్తగూడెంలో ఉన్న ప్రభుత్వ ఇంజనీరింగ్‌ కాలేజీని మైనింగ్‌ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్‌ చేయాలనే డిమాండ్‌ తెర మీదకు వచ్చింది. ఈ డిమాండ్‌ నాయకులు, ప్రజల నోళ్లలో నానుతుండగానే జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ రంగంలో పలు ఇంజనీరింగ్‌ కాలేజీలు తెలంగాణలో వచ్చాయి. దీంతో మైనింగ్‌ వర్సిటీ డిమాండ్‌ సైతం ప్రాభవం కోల్పోయింది. అయితే ఈ కాలేజీని ఎర్త్‌ సైన్సెస్‌ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్‌ చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేయడంతో మరోసారి యూనివర్సిటీ అంశం తెర మీదకు వచ్చింది.

సీఎం రేవంత్‌రెడ్డి హామీ

కొత్తగూడెంలో ఉన్న ప్రభుత్వ ఇంజనీరింగ్‌ కాలేజీని ఎర్త్‌ సైన్సెస్‌ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్‌ చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, త్వరలోనే ఇందుకు సంబంధించిన పనులు జరుగుతాయంటూ శాసన మండలిలో బుధవారం సీఎం రేవంత్‌ రెడ్డి ప్రకటించారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు యూనివర్సిటీ రావడం ఖాయమైంది. సింగరేణి బొగ్గు గనులను దృష్టిలో ఉంచుకుని ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న మైనింగ్‌ విభాగాన్ని 1978లో కొత్తగూడెం తరలించారు. ఆ తర్వాత కాకతీయ యూనివర్సిటీకి అనుబంధంగా యూనివర్సిటీ కాలేజ్‌ ఆఫ్‌ ఇంజనీరింగ్‌గా మార్చారు. గడిచిన నాలుగు దశాబ్దాలుగా వేలాది మంది ఇంజనీర్లు ఈ కాలేజీ నుంచి బయటకు వచ్చి దేశ మైనింగ్‌ అవసరాలకు ఉపయోగపడ్డారు. నిధుల కొరత, పర్యవేక్షణ లేమి, అధ్యాపకులు రాకపోవడం, ల్యాబుల ఆధునికీకరణ ఆగిపోవడంతో కొన్నేళ్లుగా ఈ కాలేజీ ప్రాభవాన్ని కోల్పోతోంది. ప్రస్తుతం యూనివర్సిటీగా అప్‌గ్రేడ్‌ చేయాలని నిర్ణయించడంతో మరోసారి ఈ కాలేజీకి గత వైభవం రానుందనే నమ్మకం కలిగింది. సుమారు 400లకు పైగా ఎకరాల్లో కళాశాల క్యాంపస్‌ విస్తరించి ఉంది. ఈ కాలేజీ భూముల్లోనే ప్రభుత్వ మెడికల్‌ కాలేజీ, జిల్లా అధికారుల సమీకృత కార్యాలయాల భవనం (కలెక్టరేట్‌) నిర్మించారు.

నిధుల విడుదల

దక్షిణ అయోధ్యగా పేరున్న భద్రాచల పట్టణంలో మౌలిక సదుపాయల కొరత తీవ్రంగా ఉంది. తెలంగాణ వచ్చాక భద్రాచలం అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయిస్తామంటూ అప్పటి సర్కారు ప్రకటన చేసింది. అయితే ఇది ఒక పట్టాన అమలుకు నోచుకోలేదు. ప్రస్తుత బడ్జెట్‌ సమావేశాల సందర్భంగా ప్రధాన ఆలయం చుట్టూ మాడ వీధుల విస్తరణ ఇతర అభివృద్ధి పనుల కోసం కేటాయించిన రూ.60 కోట్లలో రూ.34 కోట్లు విడుదల అయ్యాయి. ఇక పర్యాటక శాఖపై జరిగిన చర్చలో కిన్నెరసాని, కనకగిరి గుట్టలు, భద్రాచలం దగ్గర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు సీఎం రేవంత్‌ రెడ్డిని కలిసేందుకు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య చేసిన ప్రయత్నాలు విఫలం కావడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీనిపై అసెంబ్లీలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో ప్రస్తావించారు. దీంతో గుమ్మడికి సీఎం అపాయింట్‌మెంట్‌ ఇవ్వడమే కాకుండా బడ్జెట్‌ సమావేశాలు ముగిసిన తర్వాత ఇల్లెందు–సీతారామ అంశంపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

కార్పొరేషన్‌ బిల్లు ఆమోదం

కొత్తగూడెం – పాల్వంచ – సుజాతనగర్‌లను ఒక్కటిగా చేస్తూ కొత్తగూడెం మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఏర్పాటుకు గత జనవరి 4న రాష్ట్ర కేబినెట్‌ ఆమోదం తెలిపింది. తదుపరి కార్యాచరణలో భాగంగా ప్రస్తుత బడ్జెట్‌ సమావేశాల్లో కొత్తగూడెం కార్పొరేషన్‌ బిల్లును మార్చి 18న అసెంబ్లీలో ప్రవేశపెట్టగా ఆ తర్వాత జరిగిన చర్చలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆమోదం పొందింది. మరోవైపు ఇదే బడ్జెట్‌లో నగరాభివృద్ధి పద్దు కింద కొత్తగూడెం కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించారు. మరోవైపు కల్లూరుకు మున్సిపాలిటీ హోదా దక్కింది.

కన్నీటి వేదన..

- విషాదంగా మారిన భవనం కూలిన సంఘటన
- శిథిలాల కింద పడి ఇద్దరు కార్మికుల మృతి
- గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగిన సహాయక చర్యలు
- బంధువుల ఆందోళనతో భద్రాచలంలో ఉద్రిక్త పరిస్థితి





శిథిలాల నుంచి వెలికితీసిన మృతదేహం, (ఇన్‌సెట్‌) పడిసాల ఉపేందర్‌(ఫైల్‌)

భద్రాచలం అర్బన్‌: భవన నిర్మాణ కార్మికుల కుటుంబ సభ్యుల రోదనలు, బంధువుల ఆందోళనలతో భద్రాచలంలో విషాదం నెలకొంది. మరో వైపు రెస్క్యూ బృందాల సహాయక చర్యలు చేపట్టాయి. మండుటెండల్లో కూడా ఉన్నతాధికారుల పర్యవేక్షణలతో శిథిలాల తొలగింపు పనులు సాగించారు. భద్రాచలంలో ఐదు అంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో శిథిలాల కింద ఇరుక్కుపోయిన ఇద్దరు కార్మికులను వెలికితీశారు. చల్లా కామేశ్వరరావును బుధవారం అర్ధరాత్రి 1.47 గంటలకు బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి 2.20 గంటలకు మృతి చెందాడు. 12 గంటల పాటు మృత్యువుతో పోరాడిన కార్మికుడు ఆస్పత్రికి తరలించిన కొంతసేపటికే తనువు చాలించాడు. సహాయక చర్యలను కొనసాగించిన ఎన్‌డీఆర్‌ఎఫ్‌, సింగరేణి, విపత్తుల నివారణ శాఖ సిబ్బంది గురువారం అర్ధరాత్రి 1.42 గంటలకు మరో కార్మికుడు పడిసాల ఉపేందర్‌ మృతదేహాన్ని వెలికితీశారు. అప్పటికే మృతదేహం కుళ్లిపోయే స్థితికి చేరింది. అనంతరం భద్రాచలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


కుటుంబీకులు, బంధువుల ఆందోళన

ఉపేందర్‌ ఆచూకీ ఆచూకీ గుర్తించడంలో అధికారులు విఫలయ్యారని ఆరోపిస్తూ మధ్యాహ్నం కుటుంబ సభ్యులు, బంధువులు, కాలనీవాసులు ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. బాధితుల కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్‌ చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్తతకు దారితీసింది.

అర్ధరాత్రి వరకు రెస్క్యూ

కార్మికుడు ఉపేందర్‌ ఆచూకీ కోసం గురువారం అర్ధరాత్రి వరకు రెస్క్యూ కొనసాగించారు. శిథిలాలను తొలగించే క్రమంలో ఇంటి యజమాని శ్రీపతి శ్రీనివాస్‌కు చెందిన ఓ లాకర్‌ బయట పడగా, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాత్రి 7 గంటలకు భవన ప్రవేశ ద్వారం వైపు నుంచి దుర్వాసన రాగా, ఆ దిశగా శిథిలాల తొలగింపు పనులు చేపట్టి అర్ధరాత్రి ఉపేందర్‌ మృతదేహాన్ని గుర్తించారు. ఇద్దరు కార్మికుల మృతితో భద్రాచలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు కామేశ్వరరావు అవివాహితుడు. ఏడాది క్రితం తండ్రి మృతి చెందడంతో తల్లి రేవతి తానే సాకుతున్నాడు. కామేశ్వరరావు మృతి చెందడటంతో తల్లి ఒంటరిగా మారింది. మరో మృతుడు ఉపేందర్‌కు భార్య రమాదేవి, కుమారుడు జశ్వంత్‌, కుమార్తె నందుశ్రీ, ఉన్నారు.

ఆరుతడి పంటలతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న ప్రగతి కుమారి

చింతకాని : వరికి బదులు ఆరుతడి పంటలు సాగుచేస్తే అధిక ఆదాయాన్ని పొందవచ్చని రాజేంద్రనగర్‌ సమగ్ర వ్యవసాయ పద్ధతుల విభాగం సీనియర్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ సీహెచ్‌ ప్రగతి కుమారి అన్నారు. మండలంలోని బస్వాపురం రైతు వేదికలో ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, మధిర వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆరుతడి పంటల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోని 75 జిల్లాల్లో ఆరుతడి పంటల సాగును పైలట్‌ ప్రాజెక్ట్‌గా చేపట్టినట్లు తెలిపారు. చింతకాని మండలం రామకృష్ణాపురం, బస్వాపురం, రాఘవాపురం గ్రామాలకు చెందిన 109 మంది రైతులను ఎంపిక చేసి వరికి బదులుగా ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పెసర, మినుము పంటలను సాగు చేయించామని తెలిపారు. జీరో టిల్లేజ్‌ పద్ధతిలో మొక్కజొన్న సాగు చేస్తే ఎకరానికి వరి కంటే రూ.29 వేలు నికర ఆదాయం రావడమే కాక 47 శాతం నీటి వినియోగం తగ్గుతుందని తెలిపారు. అలాగే పెసర, మినుము పంటలు సాగుచేసినా అదనంగా ఆదాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో మధిర వ్యవసాయ శాస్త్రవేత్తలు రుక్మిణీదేవి, నాగస్వాతి, భరత్‌, ఏడీఏ విజయ్‌ చంద్ర, మండల వ్యవసాయాధికారి మానస, వ్యవసాయ విస్తరణాధికారి ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులకు నష్టం కలిగే పనులు చేయొద్దు



మాట్లాడుతున్న వెంకటరమణ

ఖమ్మంక్రైం: రైతులకు నష్టం కలిగే పనులు చేయొద్దని జిల్లా రవాణాశాఖాధికారి వెంకటరమణ హార్వెస్ట్ యంత్రాలు (వరికోత మిషన్లు) యజమానులకు సూచించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు గురువారం ఆయన జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరికోసే సమయానతాలు వడ్లను మంచి వడ్లలో కలపొద్దని, ఇష్టానుసారంగా కిరాయి వసూలు చేయొద్దని, సకాలంలో కోతలు పూర్తి చేయాలన్నారు. రైతులకు నష్టం కలిగించేలా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఏఎంవీఐ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న సత్యనారాయణ

వైరా: బాలల హక్కుల పరిరక్షణకు అధికారులు కృషి చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి కస్తాల సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాలల సంరక్షణ సేవలపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐసీడీఎస్ సిబ్బంది నిత్యం గ్రామాల్లో ప్రజలతో మమేకమై బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, చిన్నారులకు పౌష్టికాహారం అందేలా కృషి చేయాలని, చిన్న పిల్లలను పనిలో పెట్టుకునే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ శ్రీనివాస్, ఎంపీడీఓ సరస్వతి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు మే 31 గడువు

ఖమ్మంమయూరిసెంటర్: పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల కోసం 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీలతో పాటు దివ్యాంగుల విద్యార్థులు ఈ–పాస్ వెబ్‌సైట్‌లో నమోదుకు మే 31 వరకు గడువు పొడిగించినట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు కస్తాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగి తమ బ్యాంక్ అకౌంట్‌ను సంబంధిత బ్యాంక్‌లో ఆధార్ సీడింగ్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీ ప్రిన్సిపాళ్లు డిజిటల్ కీని సంబంధిత ప్రిన్సిపాల్ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కాలేజీ ఈ–పాస్ లాగిన్‌లో కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, విద్యార్థులు ఉపకార వేతనాల దరఖాస్తులను ధ్రువీకరించిన తర్వాత డిజిటల్ సిగ్నేచర్ ద్వారా మాత్రమే ఈ–పాస్ లాగిల్‌లో జిల్లా అధికారికి ఫార్వర్డ్ చేయాలని సూచించారు.

విద్యా వాతావరణం మెరుగుకు కృషి



కొత్త బెంచీలతో అధికారులు, సంస్థ ప్రతినిధులు

నేలకొండపల్లి: విద్యా వాతావరణం మెరుగుపర్చడం కోసం తమ సంస్థ కృషి చేస్తుందని కోరమండల్ మన గ్రోమోర్ సంస్థ వరంగల్ డీజీఎం సానికొమ్ము శ్రీనివాసరెడ్డి అన్నారు. సంస్థ ఆధ్వర్యాన మండలంలోని రాజేశ్వరపురం ప్రభుత్వ పాఠశాలకు రూ.3 లక్షల సాయంతో బెంచీలను అందించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండి సమాజానికి గొప్ప మార్గదర్శకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సంస్థ తరపున విద్యాభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు, మండల వ్యవసాయాధికారి ఎం.రాధ, సంస్థ ప్రతినిధులు మంజు, ప్రదీప్‌కుమార్, రాజేష్, రెహమాన్, వీరమల్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

మధిర: మండలంలోని సిరిపురం గ్రామంలో ఉన్న శ్రీ నరేంద్ర స్వామి వారి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయంలోని అమ్మవారి వెండి కిరీటం, హుండీలో ఉన్న రూ.20వేల నగదును అపహరించారు. అంతేకాక సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్ డిస్క్‌ను సైతం తీసుకెళ్లారు. ఆలయ పూజారి రామకృష్ణ గురువారం ఉదయం ఆలయానికి వెళ్లగా ఆలయ తలుపు తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించి ఆలయ మేనేజర్ రామకోటేశ్వరరావుకు, రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవికి సమాచారం అందించారు. ఘటనాస్థలాన్ని మధిర సీఐ మధు, ఖమ్మం నుంచి క్లూజ్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించారు. రూ. 42వేలు విలువచేసే సొత్తును అపహరించినట్లు గుర్తించారు. ఆలయ మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భవనాలు భద్రమేనా..?

- అడ్డగోలుగా బహుళ అంతస్తుల నిర్మాణాలు
- శిథిలావస్థ భవనాల తొలగింపుపై మీనమేషాలు
- ప్రమాదాలు జరిగినప్పుడే హడావుడి
- ఆ తర్వాత పట్టించుకోని అధికార యంత్రాంగం



శిథిలావస్థకు చేరిన నిజాంపేట ప్రాంతంలోని దేవాదాయశాఖ భవనం

ఖమ్మంమయూరిసెంటర్: నిబంధనలు పాటించని బహుళ అంతస్తుల నిర్మాణాలు, శిథిలావస్థకు చేరిన భవనాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. నగరంతోపాటు జిల్లాలో పలు ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా భవనాలను నిర్మిస్తున్నారు. అంతేకాక ఎప్పుడు కూలుతాయో తెలియని భవనాలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తున్నా.. వీటిపై చర్యలు మాత్రం ఉండడం లేదు. జరగరాని ఘోరం జరిగినప్పుడు మాత్రం అధికార యంత్రాంగం స్పందించి నోటీసులు ఇవ్వడం, ఎక్కడెక్కడ ఇటువంటి భవనాలు ఉన్నాయో లెక్కలు తీస్తున్నాయి. ఆ తర్వాత పరిస్థితి యథావిధిగానే ఉంటుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం కుప్పకూలడంతో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలపై చర్చ మొదలైంది.

అడ్డగోలుగా నిర్మాణాలు..

జిల్లాలో ప్రధానంగా ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో భవన నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఖమ్మం నగరంతో పాటు నగరానికి ఆనుకుని ఉన్న ఖమ్మంరూరల్ మండలంలో కూడా బహుళ అంతస్తుల నిర్మాణాలు పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి. అయితే ఆయా భవనాల నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా..? లేవా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒకటి, రెండు అంతస్తులకు అనుమతులు తీసుకుంటున్న యజమానులు నాలుగు నుంచి ఐదు అంతస్తులను నిర్మిస్తున్నారు. ఇక బిల్డర్లు ఏ మేరకు నాణ్యత పాటిస్తున్నారనేది కూడా తెలియని పరిస్థితి నెలకొంది. లాభాల కోసం భవనాలను నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇటీవల ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ ప్రాంతంలో జీ ప్లస్ 1కు అనుమతి తీసుకుని.. 5 అంతస్తులకు స్లాబ్ వేశారు. దీనికి ఎలాంటి సెట్‌బ్యాక్ కూడా లేదు. అధికారుల పరిశీలనలో ఈ భవనాన్ని గుర్తించి పెనాల్టీ విధించడంతో పాటు పైన రెండు అంతస్తులను నిర్మించకుండా అడ్డుకున్నారు. ఇలాంటివి పదుల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది.

106 భవనాలకు నోటీసులు..

2020లో అధికారులు నగరంలో 106 శిథిలావస్థ భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఇందులో ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలున్నాయి. నాటి నుంచి ఇప్పటి వరకు 102 భవనాలను తొలగించినట్లు అధికారులు లెక్కలు చూపిస్తుండగా.. మరో నాలుగు భవనాలు అలాగే ఉన్నాయి. పూర్తిగా శిథిలమైన భవనాలను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. నగరంలోని శుక్రవారపేట, నిజాంపేట, త్రీటౌన్ ప్రాంతం, మామిళ్లగూడెం ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలు ఇంకా ఉంటాయని, వీటిని అధికారులు గుర్తించడం లేదనే విమర్శలున్నాయి. ఆయా ప్రాంతాలతో పాటు నగరంలో అనేక చోట్ల పాత భవనాలపై కొత్త నిర్మాణాలు చేపడుతున్నారు. పాత భవనాల పరిస్థితి ఏంటనేది కూడా తెలుసుకోకుండా అధికారులు వాటిపై మరో నిర్మాణానికి ఎలా అనుమతులు ఇస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. అధికారులు కూడా అనుమతులు ఇచ్చేటప్పుడు స్థలాలను పరిశీలించడం లేదని, ఉన్న భవనాల పరిస్థితిని కూడా అంచనాలు వేయడం లేదని విమర్శలు చేస్తున్నారు.

నగరంలోని నిజాంపేట ప్రాంతంలో ఎండోమెంట్‌కు సంబంధించిన ఓ భవనం శిథిలావస్థకు చేరింది. దీనిని తొలగించాలని 2020లో అధికారులు నోటీసులు జారీ చేశారు. పలుమార్లు భవనంను తొలగించేందుకు కేఎంసీ అధికారులు అక్కడికి వెళ్లినా పలు కారణాలతో భవనాన్ని తొలగించకుండా వెనుదిరిగారు. ఎండోమెంట్ అధికారులు కూడా తొలగింపునకు పలు కారణాలు చూపి అడ్డుపడినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఈ భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. దీనికి ఎదురుగానే స్థానికులు టిఫిన్ సెంటర్ పెట్టుకున్నారు. చిన్నపిల్లలు కూడా చుట్టుపక్కల ఆటలు ఆడుతూ ఉంటారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే పరిస్థితి ఏంటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను గురువారం విద్యాలయ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు ప్రకటించారు. మొత్తం 80 సీట్లకు గాను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2625 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో అర్హత సాధించిన విద్యార్థుల హాల్ టికెట్ నంబర్లను ప్రిన్సిపాల్ విడుదల చేశారు. ఇందులో నంబర్ల వివరాలిలా ఉన్నాయి.

ఎన్ 3596585, బీ 3596589, బీ 3597185, కే 3597635, ఎఫ్ 3596247, ఎఫ్ 3596941, జే 3597808, జే 3597828, జే 3598088, ఓ 3595962, కే 3597817, ఓ 3597873, ఓ 3596215, పీ 3597360, జే 3598049, ఎల్ 3595493, డీ 3595942, ఎల్ 3597191, ఎల్ 3597986, ఎల్ 3598140, కే 3595343, ఎల్ 3595434, ఐ 3595764, ఎం 3596064, ఎం 3596065, ఐ 3596120, ఎల్ 3596417, కే 3596800, ఐ 3596893, ఎల్ 3597160, జే 3597386, జే 3597680, ఎన్ 3597784, ఎం 3597796, ఐ 3597924, ఎన్ 3598032, ఓ 3598273, జే 3598281, ఎల్ 3598318, జే 3595595, జే 3596162, జే 3596266, ఎన్ 3596345, ఎన్ 3596732, ఎన్ 3596745, జే 3596926, ఎన్ 3597153, జే 3597221, ఎన్ 3597274, ఎన్ 3597864, జే 3597920, జే 3597933, జే 3597944, జే 3597962, ఏ 3598360, కే 3596058, కే 3596102, కే 3596114, ఓ 3597822, కే 3597896, ఓ 3597899, కే 3597953, ఓ 3597958, ఓ 3597983, ఓ 3598289, ఎల్ 3595332, ఎల్ 3595335, పీ 3595352, ఎల్ 3595354, ఎల్ 3595447, పీ 3595483, పీ 3595789, పీ 3597170, ఎల్ 3597195, పీ 3597471, ఎల్ 3597936, ఎల్ 3597969, ఎల్ 3598217, ఎల్ 3598382, ఎల్ 3598396.

నేడు వార్షికోత్సవం..

పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో శుక్రవారంవార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్,అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

‘ఓపెన్’ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం అదనపు కలెక్టర్, కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో ‘ఓపెన్’పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన ఏప్రిల్ 20 నుంచి 26 వరకు పరీక్షలు నిర్వహిస్తుండగా.. జిల్లాలో 655 మంది పదో తరగతి అభ్యర్థులకు గాను నాలుగు పరీక్షా కేంద్రాలు, 898 మంది ఇంటర్ అభ్యర్థులకు మరో నాలుగు పరీక్షా కేంద్రాలను నగరంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకు ఎనిమిది సిట్టింగ్ స్క్వాడ్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామన్నారు. సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదన్నారు. పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాలు పోస్టల్ శాఖ ద్వారా డీఆర్‌డీసీ సెంటర్‌కు పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి, ఓపెన్ స్కూల్ జిల్లా కన్వీనర్ పాపారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

• పచాస్ సాల్ కే బాద్ !



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పెనుబల్లి : యాభై సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనంతో కలుసుకున్నారు పదో తరగతిలో కలిసి చదువుకున్న స్నేహితులు. వీఎం బంజర జెడ్పీ హైస్కూల్‌లో 1974 – 75 సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన స్నేహితులు అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తుమ్మలపల్లి గ్రామంలో ఏరా కమలాకర్ ఇంటి వద్ద ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలో కలిసిన వారి వయస్సు సుమారు 65 ఏళ్లు కాగా నాయకులుగా, అధికారులుగా, అధ్యాపకులుగా, వ్యాపారస్తులుగా కొనసాగుతున్న వారంతా స్నేహితులను చూడగానే పిల్లల్లా మారిపోయారు. ఈ కార్యక్రమంలో ఈడ కమలాకర్, కనగాల వెంకటరావు, దొంతుబోయిన నరసింహారావు, కనకాల సాంబశివరావు, ఎడ్ల వెంకటేశ్వరావు, నాగుబండి వెంకటేశ్వరరావు, మోటపోతుల వెంకటేశ్వరరావు, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనున్న నేపథ్యాన అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఏప్రిల్‌కు సంబంధించిన రేషన్ బియ్యం ఆయా దుకాణాలకు సరఫరా అవుతున్న క్రమంలో గురువారం జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి(డీసీఎస్ఓ) చందన్‌కుమార్ గురువారం నగరంలోని పలు రేషన్‌దుకాణాలను తనిఖీ చేశారు. కాగా, ఇప్పటి వరకు 450 దుకాణాలకు 4 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా కావడంతో నిల్వలను పరిశీలించారు. దుకాణాల వద్ద సైతం కొత్త బోర్డులు రాపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ డీటీ విజయ్‌బాబు, డీలర్లు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ పనుల పరిశీలన



మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి తదితరులు

ఖమ్మంఅర్బన్: జిల్లాలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈ బుచ్చిరెడ్డి, ఈఈ వెంకటరమణరావు, డీఈ చంద్రమోహన్ గురువారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటిస్తున్నారా అని ఆరా తీశారు. మున్నేరుపై నిర్మిస్తున్న రీటైనింగ్ వాల్స్, తిరుమలాయపాలెం మండలంలో కొనసాగుతున్న సీతారామప్రాజెక్ట్ అండర్ టన్నెల్ పనులు, రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎస్ఈ మంగళపుడి వెంకటేశ్వర్లు, ఈఈ అనన్య, డీఈలు జాన్‌బీ, ఝాన్సీ పాల్గొన్నారు.

పంటలు నమోదు చేసుకోవాలి

కారేపల్లి: రైతులు విధిగా పంట నమోదు చేయించుకోవాలని డీఏఓ పుల్లయ్య సూచించారు. గురువారం కారేపల్లి సొసైటీ ఎరువుల గోడౌన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంటలు నమోదు చేస్తేనే ప్రభుత్వ రంగ సంస్థలకు విక్రయించే అవకాశం ఉంటుందన్నారు. పంటల విస్తరణను అనుసరించి ప్రభుత్వం వ్యవసాయ ప్రణాళికను తయారు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ బి.అశోక్‌కుమార్, ఏఈఓ బి. నరేష్, కార్యదర్శి బొల్లు హన్మంతరావు, గోడౌన్ ఇన్‌చార్జి ముండ్ల సురేష్ పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో ఇరువర్గాల ఘర్షణ..

పలువురికి గాయాలు

బోనకల్: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఇరువర్గాల వారు ఘర్షణ పడి దాడులు చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈనేపథ్యాన ఇరువర్గాల వారు ఒకరిపైఒకరు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన పెద్దప్రోలు మురళి గురువారం తన చేను నుంచి ఆవును తోలుకొని వస్తున్నాడు. ఈ క్రమంలో మరో వర్గం వారు కత్తులతో దాడులు చేశారని ఫిర్యాదు చేశారు. కొమ్మినేని రమేష్, అతడి వర్గీయులు కూడా తమపై కత్తులు, రాళ్లతో దాడులు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, ఒక ఇంటి స్థలానికి సంబంధించి వివాదంతో పాటు వ్యక్తిగత కక్షల నేపథ్యాన దాడులు చేసుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో గత కొంతకాలంగా ఘర్షణలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టకపోతే మరిన్ని ఘర్షణలు జరుగుతాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గాయపడిన వారిని మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ‘బాగం’ఎన్నిక



బాగం హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడిగా మరలా బాగం హేమంతరావు ఎన్నికయ్యారు. నిజామాబాద్‌లో ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఆయనను రెండోసారి ఎన్నుకున్నారు. నేలకొండపల్లి మండలం ముటాపురం గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన హేమంతరావు విద్యార్థి, యువజన ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించారు. విద్యార్థి సంఘం (ఏఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా, కార్యదర్శిగా, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన సుదీర్ఘ కాలం సీపీఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా, జాతీయ సమితి సభ్యులుగా పనిచేస్తున్నారు. గురువారం ఆయన ఎన్నికపై పలువురు హర్షం వ్యక్తం చేస్తూ, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పక్షాన రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామన్నారు. బాగంతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఖమ్మం జిల్లా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు దొండపాటి రమేష్, మిడికంటి వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ఖమ్మం సహకారనగర్: సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్‌కె.అఫ్జల్‌హసన్‌ను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) శ్రీనివాసులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో మూడు క్రిమినల్ కేసులు అయినందున సస్పెన్షన్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇళ్ల స్థలాల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నేలకొండపల్లి: రామోజీ ఫిల్మ్‌సిటీలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఆక్రమించిన యాజమాన్యానికిప్రభుత్వం వత్తాసు పలకడాన్ని నిరసిస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యాన మండల కేంద్రంలో ప్రభుత్వదిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి మాట్లాడుతూ.. పేదల ఇళ్ల స్థలాలను పేదలకు ఇచ్చి, యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పేదల పక్షానా మాట్లాడిన రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని అక్రమ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. హామీలు అమలు చేయకుండా పేదలకు పంచిన స్థలాలను పెద్దలకు దారాదత్తం చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏటుకూరి రామారావు, గుడవర్తి నాగేశ్వరరావు, పెద్దిరాజు నర్సయ్య, సామాల మల్లిఖార్జున్‌రావు, మారుతి కొండలు, కట్టెకోల వెంకటేశ్వర్లు, దండా సూర్యనారాయణ, పి.బాబు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయలేదని రైతు వినూత్న నిరసన



కల్లంలో కూర్చుని నిరసన తెలుపుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంరూరల్ : తాను తీసుకున్న పంట రుణం మాఫీ కాలేదంటూ ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామానికి చెందిన భూక్యా నాగేశ్వరరావు మిరప కల్లంలో కూర్చుని, మిర్చి దండ మెడలో వేసుకుని గురువారం వినూత్న రీతిలో నిరసన తెలిపాడు. రూ.2లక్షల లోపు రుణం మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అంతకంటే ఎక్కువ ఉన్న మొత్తాన్ని తాను బ్యాంకులో జమ చేసినా.. నేటికీ మాఫీ కాలేదని వాపోయాడు. రూ. లక్షల్లో పెట్టుబడి పెట్టి మిర్చి సాగు చేస్తే ఇప్పుడు పంటకు గిట్టుబాటు ధర రావడం లేదని, ఆ అప్పు ఎలా తీర్చాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తక్షణమే రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని కోరాడు.

టీజీఈజేఏసీ జిల్లా కో–చైర్మన్‌గా కృష్ణార్జునరావు



కృష్ణార్జునరావు

చింతకాని: తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీజీఈజేఏసీ) జిల్లా కో–చైర్మన్‌గా మండల పరిధిలోని నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఐ.కృష్ణార్జునరావు ఎన్నికయ్యారు. ఖమ్మంలో బుధవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆయన ఎన్నిక పట్ల తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్–475 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, రాష్ట్ర మహిళా కార్యదర్శులు రజియా సుల్తానా, షాహీనా బేగం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మడి మల్లయ్య, కొండా వినోద్‌బాబు, రాష్ట్ర కౌన్సిలర్లు కంచర్ల శ్రీకాంత్, సత్యనారాయణ, నర్సింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, కోశాధికారి భాస్కర్ హర్షం వ్యక్తం చేశారు.

‘ఉపాధి’ పనుల అక్రమాలు బట్టబయలు



తనిఖీలో పాల్గొన్న అధికారులు

తిరుమలాయపాలెం: మండల పరిధిలోని 2023– 24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులలో పలు అవినీతి అక్రమాలు వెలుగుచూశాయి. గురువారం తిరుమలాయపాలెం ఎంపీడీఓ కార్యాలయంలో 16వ విడత ఓపెన్‌ఫోరమ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ చుంచు శ్రీనివాస్ ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ ఆధ్వర్యాన నిర్వహించిన సామాజిక తనిఖీలో పలు అక్రమాలు వెలుగుచూశాయి. మొక్కలు లేకుండానే నిధుల డ్రాతో పాటు తప్పుడు మస్టర్లు, ఎర్రగడ్డలో తీర్మానాలు లేకుండా పనుల ఎంపిక తదితర అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సందర్భంగా ఈజీఎస్ సిబ్బందికి రూ.52వేల జరిమానా విధించగా రూ.3.24లక్షలు రికవరీ చేసేందుకు అధికారులు నిర్ణయించారు. వీటిలో ఈజీఎస్ రూ.1.19లక్షలు కాగా మిగిలినవి ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలలో అక్రమాలు జరిగినట్లు వెల్లడైంది. ఈ కార్యక్రమంలో డీవీఓ సక్రియనాయక్, డీసీ వీరయ్య, అసిస్టెంట్ డీవీఓ పవన్, ఏపీఓ శ్రీదేవి, రమేష్ బాబు, ఎస్ఆర్‌పీ చారి, పంచాయతీరాజ్ జేఈ ప్రపుల్‌కుమార్, ఏపీఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సత్తుపల్లి టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సత్తుపల్లి మండలం కాకర్లపల్లి లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామానికి చెందిన మట్ట వెంకటేశ్వరరావు (35) ద్విచక్ర వాహనంపై సత్తుపల్లిలోని ఒక షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న తన భార్యను తీసుకెళ్లేందుకు వస్తున్నాడు. ఈ క్రమంలో కాకర్లపల్లి శివారులోని పాత ఎన్టీఆర్ కాలువ వంతెన సమీపంలో ఓ పానీపూరి బండిని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇతడు పెయింటర్ గా పనిచేస్తున్నాడు. మృతునికి భార్య భవాని, ఒక కుమార్తె ఉన్నారు.

కూసుమంచి మండలంలో మరొకరు..

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలం తురకగూడెం గ్రామానికి చెందిన షేక్ జాన్‌పాషా(40)తన బైక్‌పై ఖమ్మం నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జుజుల్‌రావుపేట గ్రామ సమీపాన అతడి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై నాగరాజు మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
ఫ్యామిలీ
ఖమ్మం
శుక్రవారం ॥ 28-3-2025

పేరెంటింగ్

ఐఏఎస్ అధికారిణి, ఇద్దరు పిల్లల తల్లి అయిన దివ్య మిట్టల్ ఇటీవల సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేసింది.
'నేను ఒక ఐఏఎస్ అధికారిణి ని.
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఢిల్లీలో,
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎమ్) బెంగళూరులో చదివాను.
వీటిని సాధించడానికి చాలా కష్టపడ్డాను.
కానీ, నా ఇద్దరు చిన్నారి కూతుళ్లను పెంచే క్రమంలో
సవాళ్లను ఎదుర్కోవడానికి ఏదీ నన్ను సిద్ధం చేయలేదు..'
అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొంది.
ఇటీవల కాలంలో ఉద్యోగం చేసే అమ్మల శాతం పెరుగుతోంది.
అదే సమయంలో పిల్లల పెంపకం పట్ల సరైన జాగ్రత్తలు
తీసుకుంటున్నామా అనే ఆందోళనా పెరుగుతోంది.
కాలానికి అనుగుణంగా వస్తున్న మార్పులను
నేటి తల్లులు ఎలా సమతుల్యతను సాధించాలో నిపుణులు సూచిస్తున్నారు.



ఆఫీసులో అమ్మ... ఇంట్లో బిడ్డ

వయస్సుతో సంబంధం లేకుండా కష్టాల్లో ఉన్నప్పుడు మనం 'అమ్మా' అని పిలుస్తాం.

ఈ పిలుపు తల్లీ బిడ్డ జీవితాంతం పంచుకునే అనుబంధానికి స్పష్టమైన సూచన. ప్రాచీన కాలం నుండి సమాజంలో మహిళలు పిల్లల సంరక్షకులుగా పరిగణించబడ్డారు. వారి విధి ఇంటికి, ఇంట్లోని వారిని జాగ్రత్తగా చూసుకోవడానికి మాత్రమే పరిమితమయ్యింది. దీంతో తల్లులు ఎప్పుడూ ఇంట్లోనే ఉండాలనే ఈ భావన పిల్లలను వారి జీవితాల్లో, అభివృద్ధిలో సురక్షితంగా ఉంచింది. నేడు సమాజంలో తల్లులు ఇంటి పనుల నిర్వహణలోనూ, పిల్లల సంరక్షణలోనూ రెండు పాత్రలను పోషిస్తున్నారు. పిల్లల సంరక్షణలో తండ్రుల వాటా పెరిగినప్పటికీ మహిళలు ఇప్పటికీ వారి ఇంట్లో మొదటి సంరక్షకులుగా ఉంటున్నారు.

విజయవంతమైన మార్పు

ప్రపంచవ్యాప్తంగా వర్కింగ్ ఉమెన్ గురించి చేసిన అధ్యయనాల్లో దాదాపు 73 శాతం మంది మహిళలు 30 ఏళ్ల వయసులో తమ పిల్లలను చూసుకోవడానికి తమ ఉద్యోగాలను విడిచిపెట్టారని, 27 శాతం మంది కొంతకాలం తర్వాత తిరిగి వచ్చారని గమనించారు. వారిలో దాదాపు 16 శాతం మంది తమ వృత్తిపరమైన పని జీవితంలో అధికారులుగా ఉన్నారు. కాబట్టి తల్లులుగా ఉన్న మహిళలు వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను విజయవంతంగా మార్చుకుంటున్నారని కూడా స్పష్టమైంది.'ఉద్యోగినిగా డబ్బు సంపాదిస్తూ పిల్లలకు కావల్సినవి సమకూర్చగలుగుతున్నాను. కానీ, వారిని సక్రమంగా పెంచగలుగుతున్నానా..' అనుకునే తల్లులకు సాంకేతికత వరంగా మారింది. సమయానుకూలంగా వర్క్ ఫ్రమ్ హోమ్‌ను ఎంచుకోవచ్చు.

హద్దులు అవసరం

పని, కుటుంబంతో పాటు వ్యక్తిగత అవసరాలకూ ప్రాముఖ్యం ఇవ్వండి. శారీరక, భావోద్వేగ శ్రేయస్సు కోసం స్వీయ సంరక్షణ అవసరం అనేది గుర్తుంచుకోవాలి. రోజులో పిల్లలకోసమే అన్నట్టుగా కొంత సమయం గడపండి. ఆ సమయంలో ఏదైనా పని నైపుణ్యాలు నేర్పించాలా, చదువు పట్ల దృష్టి పెట్టాలా, ఆనందంగా ఉంచడానికి ప్రాధాన్యత ఇవ్వాలా.. ఇలా దేనికది బేరీజు వేసుకోవాలి. సహాయకులుగా ఉండేవారి మద్దతు ఎలా అందుతుందో చెక్ చేసుకోండి. వృత్తిపరమైన వృద్ధికి, తల్లి పాత్రకు విలువనిచ్చేవారిని సహాయకులుగా ఉండేలా చూసుకోండి. ప్రతి ఒక్కరూ జవాబుదారీతనం తీసుకునే కుటుంబ వాతావరణాన్ని సృష్టించండి. ప్రతి ఒక్కరూ పనులు చేసేలా, బాధ్యత తీసుకునే కుటుంబ వాతావరణాన్ని సృష్టించండి

– ప్రొ. పి.జ్యోతిరాజ, సైకాలజిస్ట్, లైఫ్ స్కిల్ నిపుణులు



సానుకూల ప్రభావాలు

- ఉద్యోగ తల్లిదండ్రులిద్దరూ ఇంట్లో రెండు పని చక్రాలతో తమ జీవితాలు సజావుగా నడుస్తున్నట్టు చూస్తారు. ఉన్నత విద్యను పొందగల సామర్థ్యం, భౌతిక, సౌకర్యవంతమైన జీవితాన్ని గడపగల సామర్థ్యం కారణంగా వారు మరింత సంతృప్తికరమైన జీవితాలను గడుపుతారు. ఇప్పుడు ఉద్యోగాల్లోకి వెళ్లే మహిళలు ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, కెరీర్ అవకాశాలను సరైన ప్యాకేజీలతో అందుకుంటున్నారు.
- హార్వర్డ్ బిజినెస్ స్కూల్ అధ్యయనం ప్రకారం పనిచేసే తల్లుల కుమార్తెలు వారి తల్లులకంటే 23శాతం ఎక్కువ సంపాదిస్తారని తెలిసింది. మరోవైపు పనిచేసే తల్లుల కుమారులు బాధ్యతాయుతమైన పెద్దలుగా ఎదుగుతారు. వారి ఆఫీసుల్లో లింగ సమానత్వాన్ని ఇష్టపడతారు. మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను గౌరవిస్తారు. వారు భవిష్యత్తులో తమ కుమార్తెలకు అద్భుతమైన తండ్రులుగా కూడా పెరుగుతారు.
- తమ తల్లి జీవితంలోని దుఃఖకరమైన రోజులనూ చూసి ఉంటారు. అంతేకాదు తమ తల్లి పట్టుదల, దృఢ సంకల్పం వారు మానసికంగా, ఆర్థికంగా తమ సామర్థ్యాల మేరకు తమను తాము ముందుకు తీసుకెళ్లేలా చేస్తాయి. అన్నింటికంటే వారు హీరోలలో తమ తల్లిని ఒక షీ–రో గా చూస్తారు.

మెరుగైన సమయ నిర్వహణ

- పనిచేసే తల్లులు ప్రతిరోజూ తమ పిల్లలతో కనీసం ఒకటి లేదా రెండు గంటలు గడపగలిగేలా సమయాన్ని ప్లాన్‌చేసుకోవాలి. ఇది ఒక దినచర్యగా అనుసరించాలి. వేర్వేరు పనులను షెడ్యూల్ చేయడం, వాటిని సమయానికి పూర్తి చేయడం అనే మీ అలవాటు మీ పిల్లలు అదే అడుగు జాడల్లో నడవడానికి ఒక ఉదాహరణగా ఉపయోగపడుతుంది.
- పిల్లలు టైమ్‌టేబుల్‌కు కట్టుబడి ఉండటానికి కూడా ప్రోత్సహిస్తుంది. పిల్లలు మీ పనిని పూర్తి చేయడంలో సహకరిస్తున్నందుకు మీకు సంతోషాన్ని కలిగిస్తుంది.
- కాలక్రమంలో పిల్లల సమయ నిర్వహణ నైపుణ్యాలు మెరుగుపడతాయి. ఇది వారి మెరుగైన జీవితానికి సహాయపడుతుంది. అంతేకాదు, పిల్లలతో మరింత నాణ్యమైన సమయాన్ని గడపడానికి సహాయపడుతుంది.



దివ్య మిట్టల్

అమ్మా, నువ్వే నా హీరో..

నా పెద్ద కూతురికి 8 ఏళ్లు. ప్రపంచం గురించి ఇప్పటికే భిన్నమైన ఆలోచనలను చేస్తుంటుంది. ఎదిగే క్రమంలో ఆమె ఆలోచనల కాంతిని మసకబారనివ్వం. కొన్నిసార్లు పని ఒత్తిడిలో చాలా అలసిపోయినట్టుగా ఉంటుంది. ఆ అలసటలో ఏడుపు వచ్చేస్తుంటుంది కూడా. అలాంటప్పుడు నా కూతురు నన్ను కౌగిలించుకుని, 'నువ్వు నా హీరోవి' అని చెబుతుంది. అంటే, పిల్లలు మనల్ని గమనిస్తారు. వారు మన వైఫల్యాల నుండి దృఢంగా ఎలా ఉండాలో నేర్చుకుంటారు. పడిపోవడం సహజమే అని ఆమెకు చూపించండి, ఆపై లేవండి. నా ఉద్యోగం నాకు ఇది నేర్పింది. ఏది జరిగినా నువ్వు స్థిరంగా ఉంటావని చూపించండి. మాతృత్వంలో తమకు తాము వేసుకునే ప్రశ్నల్లో కొంత అపరాధ భావనతో నిండి ఉంటాయి. నేను పిల్లలకు సరైనదే ఇస్తున్నానా, ఏమైనా తప్పులు చేస్తే.. ఇలాంటివి తలెత్తుతుంటాయి. కానీ, తెలుసుకోవాల్సింది ఏంటంటే మీరు మీ సొంత మార్గంలో ప్రయాణిస్తూ ఆమె దేనినైనా వెంబడించగల ప్రపంచాన్ని నిర్మిస్తున్నారని గుర్తించాలి. తనను తాను క్షమించుకుంటూ ముందుకు సాగడం కూడా చాలా ముఖ్యం. మీకు ఒకరి కంటే పిల్లలు ఎక్కువమంది ఉంటే ఆ బాధ్యత పది రెట్లు పెరుగుతూనే ఉంటుంది. అందుకని, పిల్లలను ప్రేమించడం కంటే కూడా న్యాయంగా ఉండడటం ముఖ్యం.


– దివ్యా మిట్టల్

రోజువారీ జీవన విధానంలో ముఖ్యమైన వాటికి సమయం ఇస్తూ, తమ పనిని బ్యాలెన్స్ చేసుకుంటూ, చేస్తున్న పని గురించి పిల్లలకు క్లారిటీ ఇవ్వడం వల్ల మెరుగైన ప్రయోజనాలను పొందుతారు.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

యుక్త వయసు

తల్లిదండ్రులు పిల్లల కోసం కష్టపడుతుంటారు.
పిల్లలు చదువులతో కష్టపడాలి వాస్తవంగా.
కాని వారికి సోషల్ మీడియాలోని
చెత్తా చెదారం, తప్పడు సమాచారం,
ఉద్రిక్త ఆకర్షణలు, హింసాత్మక భావజాలాలు...
ఇవి కష్టాలు తెచ్చి పెడుతున్నాయి.
ఇటీవల వచ్చిన 'అడోలసెన్స్' వెబ్‌సిరీస్
మీద సర్వత్రా చర్చ జరుగుతున్నది.
ఇది హెచ్చరిక అంటున్నారు.
ఈ సిరీస్ మనల్ని ఎలా నిద్ర లేపుతున్నది?



డిజిటల్ లోయల్లో టీనేజ్ పిల్లలు

మీ పిల్లలు మీతో ఇంట్లో మాట్లాడే భాష మీకు తెలుసు. వాళ్లు సోషల్ మీడియాలో మాట్లాడే భాష మీకు తెలుసా? వాళ్లు ఉపయోగించే 'ఎమోజీ'ల అర్థాలు తెలుసా? మాటలు లేకుండా ఎమోజీలతో గాయపరిచే వీలు ఉంటుందని తెలుసా? కిడ్నీ బీన్స్, రెడ్ పిల్, బ్లూ పిల్, డైనమైట్, రెడ్ హార్ట్, పర్పుల్ హార్ట్, ఎల్లో హార్ట్.... ఈ ఎమోజీల అర్థం ప్రతి దానికీ మారుతుంది. అవి ఎందుకు ఉపయోగిస్తున్నారు. ఇంట్లో మన ఎదురుగా పిల్లలు ఎలా ప్రవర్తిస్తున్నారో మీకు తెలుసు. సోషల్ మీడియాలో ఎలా ప్రవర్తిస్తున్నారో మీకు తెలుసా?

ముఖ్యంగా వారి వయసు 12– 14 సంవత్సరాల మధ్య ఉంటే వారికి తెలిసింది ఎంత... తెలియంది ఎంత... తెలిసీ తెలియంది అంత.

జాగ్రత్త సుమా... అని హెచ్చరించడానికి వచ్చింది 'అడోలసెన్స్' అనే వెబ్ సిరీస్.

నాలుగు ఎపిసోడ్స్‌ల సిరీస్

'అడోలసెన్స్' అనేది నాలుగు ఎపిసోడ్ల మినీ వెబ్ సిరీస్. బ్రిటిష్ క్రైమ్ డ్రామా. బ్రిటన్‌లో టీనేజీ పిల్లల్లో పెరుగుతున్న హింసా ప్రవృత్తిని గమనించి ఈ సిరీస్‌ను తీశారు. జాక్ థోర్న్ స్క్రిప్ట్ రాస్తే, ఫిలిప్ బరాన్‌టిని దర్శకత్వం వహించాడు. ఒక్కో ఎపిసోడ్ ఒక గంట ఉంటుంది. విశేషం ఏమిటంటే ప్రతి ఎపిసోడ్ సింగిల్ షాట్. అంటే మధ్యలో కట్ లేకుండా కెమెరా కదులుతూ దృశ్యాలను చూపుతూ వెళుతుంది. ఈ మేకింగ్‌లో వినూత్నత వల్ల కూడా ఈ సిరీస్ ప్రశంసలు అందుకుంటోంది.

ఆ పసివాడి సంఘర్షణ

ఈ సిరీస్ మొదలు కావడమే 'జెమీ మిల్లర్' అనే 13 ఏళ్ల పిల్లవాడి అరెస్టుతో మొదలవుతుంది. ముందు రోజు రాత్రి స్కూల్లో తన క్లాస్‌మేట్ అమ్మాయి కేటీని కత్తితో ఏడుసార్లు పొడిచి చంపాడని అభియోగం. తండ్రి, తల్లి, సోదరి హడలిపోతాడు. జెమీ మిల్లర్ అయితే పోలీసులను చూసి ప్యాంట్ తడుపుకుంటాడు. ఆ తర్వాత జెమీనే కేటీని చంపాడని ఇందుకు ఒక స్నేహితుడు కూడా పురిగొల్పాడని విచారణలో ప్రేక్షకులకు అర్థమవుతూ ఉంటుంది. అయితే ఇందులో ఎవరి తప్పు ఎంత? దీనికి బాధ్యులు ఎవరెవరు? శిక్ష మాత్రం ఒక్కడికే పడబోతోందా?

ఇన్‌స్టా గొడవ

జెమీ వయసు 13 ఏళ్లే అయినా అతనికి ఇన్‌స్టా అకౌంట్ ఉంది. అందమైన ఫిమేల్‌మోడల్స్ బొమ్మలను అప్పుడప్పుడు షేర్ చేస్తుంటాడు. అతని పోస్టులకు కేటీ కామెంట్స్ పెడుతూ ఉంటుంది. వాటికి రకరకాల ఎమోజీలు వాడుతుంటుంది. అవి జెమీని బాధ పెట్టాయని మనకు తెలుస్తుంది. జెమీ తన వయసులో అపరిపక్వత వల్ల తను ఆకర్షణీయంగా లేడని తనను ఎవరూ ఇష్టపడరని న్యూనతతో ఉంటాడు. కేటీ కామెంట్స్ ఇందుకు ఆజ్యం పోస్తాయి. అంతే కాదు సాటి మనిషి పట్ల, ఆడపిల్లల పట్ల సెన్సిటివ్‌గా ఉండాలనే భావజాలం కాకుండా వాళ్లను ఏమైనా అనొచ్చు ఎలాగైనా ఉండొచ్చు అనే ఆధిపత్యపు భావజాలమే ఎక్కువగా జెమీకి పరిచయం అవుతుంటుంది. వీటన్నింటి దరిమిలా అతడు కేటీ ప్రాణం తీసేవరకూ వెళతాడు.

ఎవరు నిందితులు?

సోషల్ మీడియాను, ఎమోజీలను కనిపెట్టిన వారా? వాటిని ఫోన్లకు అనుసంధానం చేసిన వారా? పిల్లలకు ఫోన్లు కొనిచ్చిన తల్లిదండ్రులా? వాళ్లు ఏ మీడియాను ఉపయోగిస్తున్నారో చూడని తల్లిదండ్రుల నిర్బాధ్యతా? వారితో గడపలేని బిజీతో ఉన్న తల్లిదండ్రుల నిర్లక్ష్యమా? సరిగా పెంచని, సరిగా విద్యాబుద్ధులు చెప్పని వారంతా ఇందుకు బాధ్యులు కాదా? సమాజంలో పేరుకున్న హింసా ప్రవృత్తిని దూరం చేయలేని పాలనా వ్యవస్థ, శాసన వ్యవస్థ, పౌర వ్యవస్థలో ఉన్న వీరంతా కాదా బాధ్యులు.

టీనేజ్ పిల్లలు ఎంతో సున్నితమైన దశలో ఉండే సీతాకోక చిలుకలు. వారిని గురించి అందరికీ బాధ్యత ఉండాలని చెబుతోంది ఈ సిరీస్. ఇందులోని ముఖ్య పాత్రను ఒవెన్ కూపర్ అనే బాల నటుడు అద్భుతంగా పోషించాడు. దిన పత్రికల వార్తలు కూడా మనకు రోజూ టీనేజ్ పిల్లల సమస్యలు, కుటుంబాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ లోపం పట్టి ఇస్తున్నాయి. తల్లిదండ్రులు ఈ సిరీస్ చూడటం మంచిదంటున్నారు అభిరుచి ఉన్న ప్రేక్షకులు. కొందరైతే టీనేజ్ పిల్లలతో పాటుగా తల్లిదండ్రులూ చూడాలని సూచిస్తున్నారు. ముందు పెద్దలు చూడండి. ఆ తర్వాత మీకు సబబని అనిపిస్తే పిల్లలకు చూపించండి. కానీ ఆలోచించండి.

బ్యూటీ

నిర్లక్ష్యమే అసలైన సమస్య

అందంగా ఉండటం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందనేది అందరూ అంగీకరించాల్సిందే. యవ్వనంగా కనిపించాలనే తాపత్రయంతోనే జీవనం నాణ్యంగా గడపడానికీ ప్రయత్నించాలి. అందుకు బ్యూటీ చికిత్సలకు ఎక్కువ ఖర్చు పెట్టనవసరం లేదు. నేటి రోజుల్లో కాలుష్యం, సమతుల ఆహార లోపం, స్ట్రెస్ .. వీటన్నింటి ప్రభావం చర్మంపై పడుతుంది. అందుకని సమస్య ఎక్కడ ఉన్నదో దానిని పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలి.

చాలా మంది ఎదుర్కొనేవి...

యవ్వనంలో ఉన్నవాళ్లైతే యాక్నె, మంగు మచ్చలు, కాస్మొటిక్స్ వాడకం వల్ల ఏర్పడే మచ్చల సమస్య ఉంటుంది. వీటికి ఇంట్లోనే సొంత చికిత్సలు తీసుకోవడం వల్ల మరికొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉదాహరణకు.. మొటిమలకు వెల్లుల్లి, టూత్‌పేస్ట్ వంటివి వాడుతుంటారు. మంగు మచ్చలకు తమకు తామే స్టెరాయిడ్స్ వాడు



తుంటారు. ఇక శిరోజాల విషయంలో అయితే ఐరనింగ్, స్ట్రెయిటనింగ్, స్టయిలింగ్.. వంటి హెయిర్‌స్టైల్స్ ఎక్కువైపోయాయి. వీటివల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. జుట్టు ఊడిపోవడం పెరుగుతుంది.

బట్టల వల్ల అలెర్జీ

టైట్‌గా ఉండే బట్టలు వేసుకుంటుంటారు. ఫ్యాబ్రిక్ వల్ల దురద సమస్యలు వస్తుంటాయి. అవి, నిర్లక్ష్యం చేస్తే కుటుంబంలో మిగతా వారికీ ఆ ఇన్ఫెక్షన్ వ్యాపిస్తుంది. పులిపిర్లు ప్రైవేట్ పార్ట్స్‌లో వస్తుంటాయి. వాటినీ నిర్లక్ష్యం చేస్తుంటారు. కాస్మొటిక్ ప్రయోగాలు అయితే చెప్పలేం. అవి తమ చర్మానికి సరిపడతాయో లేదో కూడా చూడరు. దీని వల్ల చర్మం రంగు మారుతుంది.

ఫేషియల్స్

ఫేషియల్స్ చేయించుకుంటుంటారు. ఫ్రూట్ ఫేషియల్స్ సాధారణ కాంతికి పనిచేస్తాయి. హైడ్రా ఫేషియల్, డెర్మాఫేషియల్స్, కెమికల్ పీల్.. వంటి ఫేషియల్స్ నిపుణుల పర్యవేక్షణలోనే చేయించుకోవాలి. హెయిర్‌కి, స్కిన్‌కి పీఆర్‌పీ చేయించుకుంటారు. ఇవి చేయించుకున్నంత మాత్రాన అంతా బాగయిపోదు. సరైన మెయింటెనెన్స్ అవసరం.

చెయిన్లతో మెడపై నలుపు

ఆడవాళ్లలో చాలా వరకు మెడపైన నల్లగా అవుతుంది. ఆర్టిఫిషియల్ జ్యువెలరీ, శుభ్రత పాటించకపోవడం, అధికబరువు వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. అండర్ ఆర్మ్స్ డార్క్‌గా ఉన్నప్పుడు నిపుణుల సూచనలు తీసుకోవాలి. అధికబరువుకు లైపోసక్షన్ వంటివి చికిత్సలు తీసుకుంటారు. బరువు తగ్గినప్పుడు ఎలాంటి ఫిట్‌నెస్ సూచనలు పాటించాలో కూడా నిపుణుల సూచనలు తీసుకోవాలి.

స్ట్రెచ్ మార్క్స్

మహిళలకు ప్రసవం తర్వాత స్ట్రెచ్ మార్క్స్ పెద్ద సమస్య. ప్రసవం తర్వాత మూడవ నెల వరకు క్రీములు వాడుతూ ఉండాలి. అన్ని డెలివరీలు పూర్తయ్యాక స్ట్రెచ్ మార్క్ ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. మరో సమస్య పాదాల పగుళ్లు. క్రీమ్ వాడితే దాని మీద దుమ్ము పేరుకుంటుంది. అందుకని, రాత్రి పడుకునేముందు పాదాలను శుభ్రం చేసి, క్రీమ్ రాసి, సాక్సులు ధరించాలి.

డిటర్జెంట్స్ వల్ల ఎగ్జిమా!

చేతులకు ఎగ్జిమా వస్తుంది. డిటర్జెంట్స్ వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. అందుకని ఇంటి క్లీనింగ్‌లో చేతులకు గ్లౌజ్స్ మోచేతుల వరకు ఉండేవి మార్కెట్లో లభిస్తున్నాయి. వాటిని ఉపయోగించాలి.

పర్మనెంట్స్ చేయించుకుంటున్నారా..!

బ్యూటీ చికిత్సలలో పర్మనెంట్ మెథడ్స్‌కి ఇటీవల డిమాండ్ పెరిగింది. వాటిలో బొటాక్స్, ఫిల్లర్స్, స్కిన్ బూస్టర్స్, లిప్ కరెక్షన్, స్కిన్ టైటెనింగ్, గ్లోయింగ్ కోసం తీసుకునే ఇంజక్షన్స్.. ఈ కాస్మొటిక్స్ చికిత్సలన్నీ వైద్యుల పర్యవేక్షణలోనే తీసుకోవాలి. రెగ్యులర్ మేకప్ చేసుకునేవారు కాస్మొటిక్స్ తమ చర్మతత్వానికి సరిపడేవి ఎంచుకోవాలి. తిరిగి శుభ్రం చేసుకోవడంలోనూ జాగ్రత్తలు పాటించాలి.

– డా.స్వప్నప్రియ, డెర్మటాలజిస్ట్



పచ్చని తోరణాలు.. షడ్రుచుల ఆస్వాదన.. సంప్రదాయ వస్త్రధారణ
ఉగాదికి స్వాగతం పలుకుతూ
కొత్త ఉత్సాహాన్ని మదికి మోసుకువస్తాయి.
చేనేత చీరలు, ఎంబ్రాయిడరీ సొగసులు వాటి రంగుల హంగులు
ప్రకృతి పరవశించేలా పండగకు మరింత శోభను తీసుకువస్తాయి.
ముఖ్యంగా పసుపు, ఆరెంజ్, ఆకుపచ్చ, ఎరుపు రంగులు
పండగ కళను రెట్టింపుగా మన కళ్లకు కడతాయి.

ఫ్యాషన్

ప్రకృతి పరవశం



డిజైన్లు

చెక్స్, లైన్స్‌తో ఉన్న డిజైన్లు, మెరుపులు లేకుండా థ్రెడ్ ఎంబ్రాయిడరీ వర్క్, సహజంగా అనిపించే పెయింటింగ్స్ ఈ పండగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

చేనేత కళ

పండుగ నాడు కళను రెట్టింపు చేసే అలంకరణకు ప్రాముఖ్యత ఇస్తుంటారు. అయితే, అందుకు పెద్ద హడావిడి లేకుండా మనవైన చేనేతలలో కాంతిమంతమైన రంగులున్న చీరలను ఎంపిక చేసుకోవచ్చు. వీటిలో కంచిపట్టు చీరల నుంచి కలనేత వరకు అన్నీ పండగను వెలిగించేవే.

సహజమైన రంగులు

ప్రకృతి నేపథ్యంగా ఉగాది జరుపుకుంటారు కాబట్టి పసుపు, ఆకుపచ్చ, నారింజ, ఎరుపు రంగుల కాటన్, తెలుపు, ఎరుపు కాంబినేషన్, పింక్ కలర్ టస్సర్, సిల్క్ చీరలు ప్రత్యేక ఆకర్షణతో ఆకట్టుకుంటాయి.

ఇతర అలంకరణలు..

- చీరలకు లాంగ్ స్లీవ్స్ బ్లౌజులు, టెంపుల్ జ్యువెలరీ లేదా థ్రెడ్, టెర్రకోట జ్యువెలరీ బాగుంటాయి.
- పసుపు, ఎరుపు కాంబినేషన్ ప్లెయిన్ గాజులు, సహజంగా అనిపించేలా తక్కువ మేకప్ ప్రత్యేకతను చూపుతుంది.
- శిరోజాల అలంకరణలో జడ, కొప్పులు, పువ్వులకు ప్రాధాన్యమిస్తే పండగ ప్రకృతి కళతో ఆకట్టుకుంటుంది.



